https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 P M to 10 P M

సంపుటి: 01 / సంచిక:19 / పేజీలు :04 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / శుక్రవారం , సెప్టెంబర్ 04,2026

# ట్రంప్ దృష్టిలో అగ్రస్థానంలో మోదీ

## అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు.

# డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన సీఎం

## మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**



తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చి నెలలోగా వేగవంతంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి... కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ, వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

# కేసీఆర్ చాలా మంచోడు

## హుందాగా రిసీవ్ చేసుకునేవారు

### కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**



మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

# హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

## సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**



తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

# తెలంగాణ సర్కారు కఠిన నిర్ణయం

- ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యాన్ని విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు చేస్తామని హెచ్చరిక
- అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వని సర్పంచుల పదవులు ప్రమాదంలో పడతాయని స్పష్టీకరణ
- పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ
- కరువు సూచనల నేపథ్యంలో పామాయిల్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం


**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**



ప్రభుత్వం సంక్షేమ పథకాల కింద అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు అక్రమంగా అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా హెచ్చరించారు. పేదల ఆకలి తీర్చడానికి ఉద్దేశించిన బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పూతాని తండాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. కొంతమంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని బయట అమ్ముకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. ఇది చాలా తప్పుడు పద్ధతని, పేదల కోసం ఉద్దేశించిన పథకాలను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి, వారి రేషన్ కార్డులను రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని తేల్చి చెప్పారు. ఇక, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారికి తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఇళ్ల కేటాయింపులో పార్టీలకు అతీతంగా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచులు తమ పదవులు కోల్పోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదై పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తీవ్ర కరువు పరిస్థితులు ఎదురుకావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు.

# నేపాల్ బాధితులకు అండంగా నిలిచిన సోనూసూద్

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**




ఇటీవల సంభవించిన తీవ్ర వరదలతో అల్లాడుతున్న నేపాల్ ప్రజలను ఆదుకునేందుకు ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూసూద్ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. బాధితులకు అవసరమైన దుప్పట్లు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర సరుకులను భారత్ నుంచి తరలించి, క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అయితే, సోనూసూద్ నేపాల్ పర్యటనపై ప్రముఖ జర్నలిస్ట్ అజిత్ అంజుమ్ సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. పనులు ఇంకా ప్రారంభం కాకముందే ఆయనను దేవుడిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేసుకోవడం కేవలం 'సెల్ఫ్ మార్కెటింగ్' అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టడం కలకలం రేపింది. అయితే ఈ ప్రతికూల విమర్శలపై సోనూసూద్ ఎంతో హుందాగా, సానుకూలంగా స్పందించారు. "సోదరా.. మీ మనసు చాలా మంచిది. మీరు నేపాల్‌కు రండి, మనమిద్దరం కలిసి ప్రజలకు అండగా నిలబడి సాయం చేద్దాం" అంటూ రీట్వీట్ చేశారు. ఎలాంటి వివాదాలకు చోటు ఇవ్వకుండా, తనను విమర్శించిన వ్యక్తినే నేరుగా సేవా కార్యక్రమంలో భాగస్వామి కావాలని ఆహ్వానించిన ఆయన తీరు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. సోనూసూద్ చూపించిన ఈ సంస్కారం, పరిణతిపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా, త్రిశూలి నది పరివాహక ప్రాంతాల్లో వరద విధ్వంసం తీవ్రంగా ఉందని, బాధితుల ఇళ్లను పునర్నిర్మించి వారు సాధారణ జీవితం గడిపే వరకు కొన్ని నెలల పాటు తమ 'సూద్ ఫౌండేషన్' తరఫున సహాయక చర్యలు కొనసాగుతాయని సోనూసూద్ స్పష్టం చేశారు. పరాయి దేశంలోనూ మానవత్వాన్ని చాటుకుంటూ ఆయన అందిస్తున్న సేవలకు గానూ అంతటా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

# కొండా సురేఖను తొలగించారు..

- పొంగులేటి సంగతి ఏమిటి?
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**



తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

# అలరించిన 'పాటల పూదోట' సినీ సంగీత విభావరి

**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో 'పాటల పూదోట' పేరుతో సినీ సంగీత విభావరి శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా మారుతి కళా వేదికలో నిర్వహించారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు జి. కృష్ణ నిర్వహణలో గాయనీ గాయకులుప్రముఖ గాయని సాయి పవని, వెంకీ, ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, సరస్వతి, రమణ, ఏడుకొండలు, సుబ్బిరెడ్డి, ఆనంద్ తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.




# పోతన భాగవత సప్తాహం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**హైదరాబాద్, చిక్కడపల్లి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**

శ్రీపోతన భాగవత సప్తాహం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా "సతులారా చూడరే శ్రావణ బహుళాష్టమి" పేరుతో భక్తి సంగీత విభావరి త్యాగరాయ గానసభలోని కళా వెంకట దీక్షితులు కళా వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంగరాజు లక్ష్మి ఆధ్వర్యంలో ప్రముఖ గాయనీ గాయకులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.




# శ్రీకృష్ణ భక్తి సంగీత, కవితా మకరందం

**హైదరాబాద్, చిక్కడపల్లి , ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**

మోహన్ ట్రస్ట్ సమర్పణలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ఆధ్వర్యంలో "భగవద్గీత పారాయణోత్సవం" శ్రీత్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా "శ్రీకృష్ణ భక్తి సంగీత, కవితా మకరందం" పేరుట ప్రముఖ గాయనీ , గాయకులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.




# ముగ్గురు పిల్లలతో లోయలోకి దూకి రెజ్లర్ ఆత్మహత్య

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**

మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో క్రీడా లోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసేలా విషాద ఘటన చోటుచేసుకుంది. 'మహారాష్ట్ర టైగ్రెస్'గా పేరొందిన జాతీయ మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో కలిసి నల్‌దుర్గ్ కోటపై నుంచి 100 అడుగుల లోతైన లోయలోకి దూకింది. ఈ దారుణ ఘటనలో అశ్విని, ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా అక్కడికక్కడే మృతి చెందగా, కవల కుమార్తెలలో క్రాంతి ఆసుపత్రిలో కన్నుమూసింది. మరో చిన్నారి వీరా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడుతోంది. జాతీయ స్థాయిలో 5 స్వర్ణాలు, 6 రజత పతకాలు సాధించిన అశ్విని మృతిపై తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. భర్త, అత్తమామల శారీరక, మానసిక వేధింపుల వల్లే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందని అశ్విని తండ్రి ఫిర్యాదు చేయడంతో నల్‌దుర్గ్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# జీవనకాల గరిష్ఠానికి స్మాల్ క్యాప్స్

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపుపై ఆందోళనలు తగ్గడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అయితే కీలక స్థాయిల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్ జోరును కొంత అడ్డుకున్నాయి. విస్తృత మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతుతో స్మాల్‌క్యాప్ సూచీలు కొత్త జీవనకాల గరిష్ఠాలను తాకాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 362.57 పాయింట్లు (0.48 శాతం) లాభపడి 76,515.43 వద్ద ముగిసింది. ఓ దశలో 730 పాయింట్ల వరకు ఎగబాకి 76,883.14ను తాకింది. నిఫ్టీ 24.25 పాయింట్లు (0.10 శాతం) పెరిగి 23,897.70 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,005.75 వరకు వెళ్లింది. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ సూచీ 1 శాతానికి పైగా పెరిగి అగ్రస్థానంలో నిలిచింది. బ్యాంకింగ్ మినహా ఆర్థిక సేవల షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. మరోవైపు నిఫ్టీ ఐటీ 0.47 శాతం, ఫార్మా 0.68 శాతం, హెల్త్‌కేర్ 0.87 శాతం చొప్పున నష్టపోయాయి. మార్కెట్‌లో ఒడుదొడుకులను సూచించే ఇండియా వీఐఎక్స్ 6.24 శాతం తగ్గి 10.63కి చేరింది.

# బెంగాల్ ప్రభుత్వ సలహాదారుగా మిథున్ చక్రవర్తి

**పశ్చిమ బెంగాల్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారు (కల్చరల్ అడ్వైజర్)గా బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి నియమితుడయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సువేందు అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. కోల్‌కతా శివారులోని న్యూ టౌన్‌లో 'ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్' నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం సువేందు అధికారి మాట్లాడుతూ.. రూ.25 కోట్ల వ్యయంతో ఈ ఫిలిం సెంటర్‌ను నిర్మిస్తున్నామని, ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర సమాచార, సాంస్కృతిక శాఖ ఇప్పటికే మంజూరు చేసిందని తెలిపారు. ఫిలిం సెంటర్ డిజైన్‌ను ఖరారు చేసే బాధ్యతను పూర్తిగా బెంగాలీ సినీ రంగ నిపుణులకే అప్పగిస్తామని, ప్రభుత్వం ఇందులో ఎలాంటి జోక్యం చేసుకోదని ఆయన స్పష్టం చేశారు. "ఈ రంగంతో సంబంధం ఉన్నవారికే ఆ పనిలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. మా పని కేవలం మద్దతు ఇవ్వడమే. ప్రతి విషయంలో జోక్యం చేసుకోవడం సరికాదు" అని సీఎం అన్నారు. కోల్‌కతాలోని ప్రఖ్యాత నందన్ కల్చరల్ సెంటర్ మాదిరిగా ఈ కొత్త ఫిలిం సెంటర్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో 750 సీట్ల సామర్థ్యంతో రెండు సినిమా హాళ్లు, ఒక ప్రివ్యూ థియేటర్, ఫుడ్ కోర్ట్, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. రెండో విభాగంలో 1,000 సీట్ల ఆడిటోరియం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఓపెన్-ఎయిర్ థియేటర్ ఉంటాయి. మూడో విభాగంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, పోస్ట్-ప్రొడక్షన్ కోసం అత్యాధునిక ల్యాబొరేటరీలు, స్టూడియోలు నిర్మిస్తారు. ఇప్పటికే సాయిల్ టెస్టింగ్, స్థల ఎంపిక పూర్తయ్యాయని, డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) ప్రక్రియ కొనసాగుతోందని సీఎం వివరించారు. వర్షాకాలం ముగిసిన వెంటనే పశ్చిమ బెంగాల్ హౌసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు. సెప్టెంబర్ 6 వరకు టాలీవుడ్ (బెంగాలీ చిత్ర పరిశ్రమ) కు చెందిన పలువురు ప్రముఖులను సన్మానించనున్నట్లు, ఈ సన్మాన గ్రహీతల ఎంపికలో కూడా ప్రభుత్వం జోక్యం చేసుకోదని, సినీ పరిశ్రమ కమిటీయే ఆ బాధ్యత తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

# రేపు ఛలో నాగిరెడ్డిపేట్

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో 1000 అబద్దాలు అంటూ నిరసన

**ఎల్లారెడ్డి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4:**

కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఛలో నాగిరెడ్డిపేట్ కార్యక్రమం జరగనుంది. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల వైఫల్యాలపై శుక్రవారం ఈ నిరసన కార్యక్రమం చేపట్టనుంది. ఉ 11 గంటలకు నాగిరెడ్డిపేట్ పట్టణ కేంద్రంలో జరిగే ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ కొరకు విద్యార్థులు, యువతతో నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేఅముశ్రీతీ బి.ఆర్.ఎస్ పార్టీ, ఎల్లారెడ్డి నియోజకవర్గం నేతలు పిలుపునిచ్చారు.

# ఏఐకి పెరిగిన ఆదరణ

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**

నేటి యుగంలో ఎఐకి ఆదరణ బాగా పెరిగిందని చెప్పుకోవాలి. ప్రతీ సంస్థ దాదాపు ఎఐపై ఆధారపడటం మేదలు పెట్టాయి. ఆ దిశగా భారతదేశంలో 2024-2026 మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాల జీతాలు 23 శాతం పెరిగాయని, అదే సమయంలో కొన్ని సాంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల జీతాలు తగ్గాయని, ఇది ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసాన్ని పెంచుతోందని తెలిపింది. జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, గత సంవత్సరం ఏఐ రంగం వార్షిక ప్రాతిపదికన 12 శాతం జీతాల వృద్ధిని నమోదు చేసింది. ఇది పరిశీలించిన విభాగాలలో అత్యధికం. దీని తర్వాతి స్థానాల్లో కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ- సెమీకండక్టర్స్ చెరో 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. గత రెండేళ్లుగా కంప్యూటర్ హార్డ్‌వేర్ మరియు ఇ-కామర్స్ వంటి రంగాలలో జీతాలు తగ్గుముఖం పట్టగా, ఐటీ సేవల రంగంలో జీతాలు స్తంభించిపోయాయని నివేదిక పేర్కొంది. 0-3 సంవత్సరాల అనుభవం ఉన్న ఎంట్రీ-లెవల్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 8.87-15.41 సంపాదిస్తుండగా, 15 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్నవారికి ఇది రూ. 70.99-89.24 లక్షల వరకు పెరుగుతుంది. ఏఐ వేతనాలు ప్రాంతాన్ని బట్టి గణనీయంగా మారుతూ ఉంటాయి. ఇది ప్రత్యేక నైపుణ్యం ఉన్న యజమానులు, పరిణతి చెందిన టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లు ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయో ప్రతిబింబిస్తుంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ-కేంద్రీకృత స్టార్టప్‌లు, ప్రపంచ సామర్థ్య కేంద్రాల సాంద్రత కారణంగా, బెంగళూరు భారతదేశంలో అత్యధిక వేతనాలు ఇచ్చే మార్కెట్‌గా కొనసాగుతోంది. బెంగళూరులో సీనియర్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 61.70-91.25 లక్షలు సంపాదిస్తున్నారు. ఇది ఎన్‌సిఆర్ లేదా ముంబై కంటే సుమారు 10-15 శాతం ఎక్కువ, సీనియర్ స్థాయిలో చెన్నై కంటే 40 శాతం వరకు అధికం. విస్తరిస్తున్న జిసిసి, ఉత్పత్తి ఇంజనీరింగ్ పెట్టుబడుల మద్దతుతో హైదరాబాద్ దీనికి గట్టి పోటీదారుగా ఎదుగుతోంది. సైబర్‌సెక్యూరిటీ రంగంలో గరిష్ట వేతన పరిమితి సంవత్సరానికి రూ. 97.81 లక్షలు, ఇది పరిశీలించిన అన్ని విభాగాలలోకెల్లా అత్యధికమని నివేదిక పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఐటి సర్వీసెస్‌లో ప్రారంభ వేతనం సంవత్సరానికి రూ. 2.68-5.08 లక్షలతో మొదలై, 15 ఏళ్లకు పైబడిన వారికి సంవత్సరానికి రూ. 57.55--72.13 లక్షలకు చేరుకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ రెండు విభాగాలలోనూ వేతనాల్లో 1 శాతం తగ్గుదల నమోదైంది. కంపెనీలు దేనికి అధిక వేతనం చెల్లించాలనే విషయంలో ఎంపిక చేసుకుంటున్నాయి. కేవలం అనుభవం మాత్రమే ఇకపై అత్యధిక జీతాల పెంపును అందించడం లేదు. ఒక నైపుణ్యం వ్యాపారానికి అవసరమైన సామర్థ్య లోపాన్ని పూరిస్తుందా లేదా అన్నదే ముఖ్యం. అది ఏఐ వ్యవస్థలను నిర్మించడం, మౌలిక సదుపాయాలను భద్రపరచడం, ఫ్యాక్టరీలను ఆటోమేట్ చేయడం లేదా ప్రత్యేకమైన ఆరోగ్య సంరక్షణను అందించడం వంటివి కావచ్చునని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా అన్నారు. వ్యాపార అవసరాలు మారుతున్న కొద్దీ, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ, నవీకరించుకునే వారి జీతాలు కూడా క్రమంగా పెరుగుతాయని నిపుణులు అర్థం చేసుకోవాలని సిన్హా అన్నారు. టెక్నాలజీ రంగం వెలుపల జీతాల పెరుగుదల, కొత్త సామర్థ్యాలను పెంపొందించుకునే రంగాలలో కేంద్రీకృతమై ఉంది. గత రెండేళ్లలో, సెమీకండక్టర్ల రంగంలో 17 శాతం (మొదట 7 శాతం, ఆ తర్వాత 9 శాతం), ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో 13 శాతం (మొదట 5 శాతం, ఆ తర్వాత 8 శాతం) జీతాలు పెరిగాయి. ఈ రెండూ గత రెండేళ్లలో మరింత వేగవంతమయ్యాయి. ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌లో సీనియర్ జీతాలు రూ. 58.90 లక్షల వార్షిక ప్యాకేజీకి, సెమీకండక్టర్లలో రూ. 48.49 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరుకున్నాయి. గత ఏడాది ఆటోమోటివ్ రంగం 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. మెడికల్ ప్రాక్టీస్ రంగంలో 8 శాతం జీతాల పెరుగుదల, సీనియర్ జీతాలు రూ. 56.70 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరాయి. దీని తర్వాత మెడికల్ డివైసెస్ రంగంలో 6 శాతం, ఫార్మాస్యూటికల్స్ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. ఇక ఇదే కోణంలో ఎఐ కి ఆదరణ పెరిగితే ఆ రంగంలో రాణించే నిపుణులకు తిరుగుండదనేది నిపుణుల వాదన.

# కొండా సురేఖ బీఆర్ఎస్‌లో చేరుతారంటూ ప్రచారం..

## తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమన్న జగదీశ్ రెడ్డి




- కొండా సురేఖ పార్టీ మారుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం
- ఆమెను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదన్న జగదీశ్ రెడ్డి
- కోమటి రాజగోపాల్ రెడ్డిని కూడా చేర్చుకోబోమని వ్యాఖ్య

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**

మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్ లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వబోమని తేల్చిచెప్పారు. పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సరికొత్త బాంబు పేల్చారు.ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు.

## కేటీఆర్ పిలుపుతో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు..

# కదంతొక్కిన నేతలు..!

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 4**



మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు కన్నీళ్లే మిగిలాయని బీఆర్ఎస్ శ్రేణులు ధ్వజమెత్తాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలతో రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగడుతున్నారు నేతలు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే పద్మారావు, సిరిసిల్లలో, దేవరకద్రలో గులాబీ సైన్యం ఆందోళనలు చేపట్టింది.వికారబాద్ జిల్లా నవాబ్‌పేటలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరును సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లా మాధవి అనే దివ్యాంగురాలు తన గోడును వెళ్లబోసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సమస్యలు ఒక్కటి కూడా పట్టించుకోవడం లేదని ఆమె కన్నీటిపర్యంతమైంది. దివ్యాంగుల కోసం ఏం చేసిందో ఈ ప్రభుత్వం చెప్పాలని ఆమె ఎమ్మెల్యే పద్మారావు ముందు తన బాధను పంచుకుంది.స్థానిక ఎమ్మెల్యేగా మా దివ్యాంగుల సమస్యలను మీరైనా తీర్చాలని పద్మారావు గౌడ్‌ను కోరింది మాధవి. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన లోని వైఫల్యాలను ఎండగడుతూ.. సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్లు రోడ్డుపైనే వంట చేశారు.